## గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

- వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి
- జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



జవహర్‌లాల్‌నెహ్రూ, పింగళిసూరన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ముఖ్య అతిథులు, విద్యార్థులు

నంద్యాల కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు అని జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పింగళిసూరన స్మారక శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూకు, అష్టదిగ్గజ కవులలో ఒకరైన పింగళిసూరన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి శ్రీధర్, పాఠకులు ఓంకారప్ప, నరేంద్రనాథ్ శర్మ, శ్రీనివాసులు, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

## చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

- డీఈవో జనార్దన్‌రెడ్డి
- ఘనంగా బాలల దినోత్సవం




జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఈవో

నంద్యాల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు అని డీఈవో జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాయమాల్పురం ఎంపీయూపీ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి గ్రామంలో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, సుజాత, ఓబయ్య, సత్యవతమ్మ పాల్గొన్నారు.

## తేమ శాతం సడలించాలని సీసీఐకి విజ్ఞప్తి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 శాతం మధ్య ఉండాలనే నిబంధనను సడలించాలని సీసీఐకి విజ్ఞప్తి చేసినట్లు మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి నారాయణమూర్తి తెలిపారు. అధిక వర్షాలు, తుఫాన్ కారణంగా పత్తిలో తేమ శాతం 12 శాతం కంటే ఎక్కువగా ఉందని, దీని వల్ల రైతులు సీసీఐ సంస్థ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పత్తిని అమ్ముకోలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారని ఆయన శుక్రవారం తెలిపారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల కర్నూలు వచ్చినప్పుడు పత్తిలో తేమ శాతంపై సడలింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు.

## అరటి రైతు కుదేలు

- ధర పతనంతో లబోదిబోమంటున్న అన్నదాత
- గత ఏడాది టన్ను రూ.20 వేలు.. ప్రస్తుతం రూ.2 వేలు మాత్రమే

6

## విద్యుత్ ఉద్యోగుల బదిలీల్లో అవకతవకలు

7

# తూచ్..

తుఫాను నష్ట పరిహారం లెక్కల్లో అధికారులు గారడీ చేస్తున్నారు. మొదట 44,535 మంది రైతులు నష్టపోయారని లెక్కగట్టారు. క్షేత్రస్థాయిక వెళ్లి 22,554 మంది మాత్రమే మాత్రమే నష్టపోయారని తేల్చారు. 17,312 హెక్టార్లలో వరి పంటకు నష్టం.. చివరికి 6,384 హెక్టార్లకు కుదించారు. ఎందుకు ఇలా చేశారు? అధికారులే చెప్పాలి.

- మొంథా నష్టం అంచనాలను తారుమారు చేసిన అధికారులు
- మొదట 36,948 హెక్టార్లలో.. చివరికి చివరకు 11446 హెక్టార్లలో
- రైతులకు అడ్డంకిగా మారిన 33శాతమనే ప్రమాణం



తీవ్రంగా నష్టపోయిన రైతులు (ఫైల్)



నీటిలో మునిగిపోయిన మొక్కజొన్న పంట(ఫైల్)

నంద్యాల ఎడ్యుకేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ముందుగా వర్షాలు కురిశాయని రైతులు మురిసిపోయారు. అనుకున్న సమయం కంటే ఖరీఫ్ సాగు కాస్త ముందుగానే సాగైంది. ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు, సబ్సిడీలతో రైతు పండుగ వాతావరణం సృష్టించింది. కానీ ప్రకృతి ప్రకోపానికి రైతులు కుదేలయ్యారు. ఆగస్టు మాసం నుంచి అక్టోబర్ మాసం వరకు వరుసగా కురిసిన వర్షాలు రైతులను నట్టేట ముంచాయి. ఇక మొంథా తుఫాన్ రైతులకు తీరని నష్టం కల్గించింది. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చి నష్టపరిహారం అందించేందుకు సిద్ధమైంది. కానీ వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో నష్టపరిహారాన్ని అంచనా వేయడంలో విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ఊహమేఘాల మీద చేపట్టిన ప్రాథమిక అంచనాల్లో, ఆ తర్వాత చేపట్టిన నష్టపరిహారపు లెక్కల్లో తేడాలు స్పష్టంగా కనపడుతున్నాయి.

- నంద్యాల జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావంతో 44,535 మంది రైతులు వివిధ పంటలు నష్టపోయినట్లు అధికారులు లెక్కలు కట్టారు. తీరా క్షేత్రస్థాయిలో పరిశీలించాక కేవలం 22,554 మంది రైతులు మాత్రమే నష్టపోయారని తేల్చారు. ఇది తెలిసి రైతులు, రైతుసంఘాల నాయకులు విస్తుపోయారు. జిల్లా వ్యాప్తంగా 17,312 హెక్టార్‌లలో వరి పంటకు నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనాలు రూపొందించగా చివరకు 6,384 హెక్టార్‌లలో మాత్రమే నష్టం జరిగినట్లు సర్వేల్లో తేలడం ఏమిటో అర్థం కావడం లేదు. అలాగే జిల్లాలో అత్యధికంగా నష్టం జరిగిన పంట మొక్కజొన్న. 17,009 హెక్టార్లలో నష్టం జరిగిందని ప్రాథమిక అంచనాలు తయారు చేశారు. అంతలోనే మళ్లీ మాట మార్చి 4,295 హెక్టార్లలో మాత్రమే నష్టం జరిగిందని నివేదికలు రూపొందించారు. అన్ని పంటలూ కలిసి మొత్తంగా 36,948 హెక్టార్లలో ప్రాథమికంగా నష్టం జరిగిందని అంచనాలు తయారు చేసి, చివరికి అబ్బే అంత లేదు....మా సిబ్బంది మూడు రోజుల్లో పొలాలన్నీ తిరిగి నిక్కచ్చిగా సర్వే చేసి, 11,446 హెక్టార్లలో మాత్రమే నష్టం జరిగిందని తేల్చారని ఉన్నతాధికారులు అంటున్నారు. ఆ మేరకు నివేదికలు తయారు చేశారు.



### భారీగా నష్టపోయాను



11 ఎకరాల్లో వరి పంట వేశాను. చేతికొచ్చిన వరి రెండు రోజులపాటు నీటిలో మునగడంతో తీవ్రంగా నష్టపోయాను. అధికారులు మాత్రం 33 శాతం కంటే ఎక్కువ నష్టపోయిన రైతులకు మాత్రమే నష్టపరిహారం అందుతుందన్నారు.

- వెంకటేశ్వర్లు, రైతు, మహానంది మండలం

### రైతులందరినీ ఆదుకోవాలి



మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో 80శాతం మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం నిబంధనలను పక్కన పెట్టి ప్రతి రైతుకు అండగా ఉండాలి. రైతులకు ప్రభుత్వమే బీమా చెల్లించి వుంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. అధికారుల తప్పు లెక్కల వల్ల తీవ్రంగా నష్టపోయేది రైతులే. 33 శాతం నష్టం జరిగితే పరిహారం అనే నిబంధనను పక్కన పెట్టాలి.

- రాజశేఖర్, జిల్లా రైతుసంఘం నాయకుడు

### ప్రభుత్వ నిబంధనల మేరకే...



ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే మేము నష్టపరిహారం అంచనా వేస్తాం. ప్రాథమికంగా అంచనా వేసినప్పటికీ 33శాతం నిబంధన, ఈ క్రాప్, బీమా వంటి నిబంధనను పాటించి పంట నష్టపరిహారాన్ని అంచనా వేశాం.

- వెంకటేశ్వర్లు జిల్లా వ్యవసాయాధికారి, నంద్యాల

## సీమ ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వీడాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

కర్నూలు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వీడాలని, అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులు మొదలు పెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలో శుక్రవారం జరిగిన జిల్లా సీపీఐ సమితి సమావేశానికి హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ వెనుకబాటుకు పాలకుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ప్లంజ్ పూల్ వల్ల శ్రీశైలం ప్రాజెక్టుకు ప్రమాదం పొంచి ఉందని పలు నిపుణుల కమిటీలు హెచ్చరించినా శాశ్వత మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ ఆనకట్టకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చిత్తూరు జిల్లా కుప్పం ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకువెళ్లాలని రూ.3,500 కోట్లతో హంద్రీ-నీవా ప్రధాన కాలువను విస్తరించారన్నారు. అదే చిత్తశుద్ధితో రూ.210 కోట్లు ఖర్చు పెడితే పత్తికొండ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల కింద అదనంగా 45 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉందని, అయితే ఆ పనులు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. కేసీ కాలువ పరిధిలో అలగనూరు జలాశయం కుంగిపోయి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడం దారుణమన్నారు. జిల్లాలోని వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, కడప జిల్లాలో గాలేరు నగరిలో భాగంగా చేపట్టిన సర్వరాయసాగర్, వామికొండ జలాశయాలు, కాలువల పనులు తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు.




మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

అనంతపురం జిల్లాలో కూడా ఇలాంటి పరిస్థితే ఉందన్నారు. తుంగభద్ర నదిపై గుండ్రేవుల జలాశయం నిర్మించాలనే డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉందని, గత టీడీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చాక పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అదే నిర్లక్ష్యంతో వదిలేసిందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపి వెంటనే గుండ్రేవుల జలాశయం పనులు చేపట్టాలన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి ఐదేళ్లు అవుతోందని, ఆనాడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు కూడా సందర్శించారని గుర్తు చేశారు. అయితే ఇప్పటి వరకు పనులు చేపట్టలేదన్నారు. రూ.800 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపినా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీనిపై సీఎం చంద్రబాబుకు లేఖ కూడా రాశానని చెప్పారు. శ్రీశైలం ఎగువన కష్ణా నదిపై సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామాంజనేయులు, కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పాల్గొన్నారు.

## పాఠశాలల్లో పరిశుభ్రతను పాటించాలి

- కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి పాఠశాలలో పరిశుభ్రత కచ్చితంగా పాటించాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఎంఈవోలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. పదో తరగతి ఫలితాలు, విద్యార్థుల హాజరు, పాఠశాల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం, అపార్ ఐడీ తదితర అంశాలపై చర్చించారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, తోటి విద్యార్థులతో ఎలా మెలగాలి, గురువులను గౌరవించడం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు వంద శాతం హాజరు నమోదు చేయాలన్నారు. వచ్చేనెల జరగనున్న మెగా పేరెంట్స్- టీచర్స్ మీటింగ్‌కు పూర్తిస్థాయిలో సిద్ధమవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. డీఈవో జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని విద్యావంతునిగా తీర్చిదిద్దడంలలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. సమావేశంలో ఎస్ఎస్ఏ పీవో ప్రేమనాథ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శివనామ స్మరణతో మార్మోగిన శ్రీగిరి

- శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో కోటి దీపోత్సవం



కోటిదీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



స్వామి, అమ్మవార్లకు హారతులు ఇస్తున్న అర్చకులు

శ్రీశైలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శివనామ స్మరణతో శ్రీగిరి క్షేత్రం మార్మోగింది. శుక్రవారం శ్రీగిరి పర్వతంపై ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు పోటెత్తారు. భక్తిశ్రద్ధలతో కోటి దీపోత్సవం నిర్వహించారు. కోటిదీపోత్సవ విశేషంపై మాడుగుల నాగఫణిశర్మ వివరించిన ప్రవచనాలతో భక్తులు తన్మయత్వమై తరించారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కైలాసగిరి వేదికపై స్వామి అమ్మవార్లకు ఈవో శ్రీనివాసరావు, చైర్మన్ రమేష్ నాయుడు ఆధ్వర్యంలో అర్చక, వేదపండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించి దశవిధ హారతులు నివేదించారు. ప్రముఖ ప్రవచకులు దీవి హయగ్రీవాచార్యుల పర్యవేక్షణలో జ్ఞానం, వెలుగు, ఉత్సాహం, శాంతి, ఆనందానికి ప్రతీకగా ఉండే దీపాలను మహిళలచే వెలిగించి కోటిదీప నివేదన చేశారు. సుమారు 2000 మందికి పైగా కోటి దీపోత్సవంలో పాల్గొని దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది, శివ సేవకులు, తెదేపా నాయకులు భక్తులు పాల్గొన్నారు.



కైలాసగిరి వేదికపై జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్, ఈవో



కోటి దీపోత్సవంలో పాల్గొన్న నాయకులు

### భ్రామరికి ఊయల సేవ

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు శుక్రవారం ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిపించారు. ఉదయం గ్రామదేవత అంకాలమ్మ వారికి అభిషేకాలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చారు. సాయంత్రం లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ మహా గణపతిపూజకు సంకల్పాన్ని పఠించారు. ప్రాకార మండపంలో అమ్మవారికి ప్రీతికరమైన ప్రత్యేక పూలతో అలంకరించిన ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి పూజలను వైభవంగా నిర్వహించారు. ఊయలసేవలో లలితా సహస్రనామాలు పఠించారు. భక్తులకు దర్శనాలు కల్పించినట్లు ఈవో తెలిపారు.



ఊయలలో స్వామి, అమ్మవార్లు



దీపాలు వెలిగిస్తున్న పాలకమండలి సభ్యులు

## మైనార్టీల సంక్షేమానికి కృషి

- ఇమామ్, మౌజన్ల వేతనాలకు రూ.90 కోట్లు
- ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహమ్మద్



చెక్కును విడుదల చేస్తున్న మౌలానా షేక్‌ముస్తాక్ అహమ్మద్

ఆదోని, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపీ ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాక్ అహమ్మద్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ముస్లిం మైనార్టీల సమావేశం టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీలకు ఇచ్చిన వాగ్దానాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. రాష్ట్రంలో ఇమామ్, మౌజన్లకు 12నెలల గౌరవ వేతనాల కోసం రూ.90కోట్లు విడుదల చేస్తూ జీవో జారీ చేసిందన్నారు. అభివృద్ధి అంటేనే చంద్రబాబునాయుడు అని పేర్కొంటూ, ఆయన మైనార్టీల పక్షపాతి అని కొనియాడారు. ఉమ్మడి జిల్లాలోని ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనానికి సంబంధించిన రూ.14.36 కోట్లు భారీ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, హౌసింగ్ డైరెక్టర్ రామకృష్ణ, మండల అధ్యక్షుడు తిమ్మప్ప, శివప్ప, నాయకులు సాధికాబేగం, అఫ్సర్‌బాషా, అల్తాఫ్‌ఉసేన్, హనువాలు బాషా, అరీఫ్, జాఫర్, బండి మాబాష, ఎగ్బాల్ పాల్గొన్నారు.



## వ్యర్థాల హంద్రీ

నగరంలోని హంద్రీ.. వ్యర్థాల నిలయంగా మారింది. ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వరదతో హంద్రీ పొంగి ప్రవహించింది. దేవనగర్ సమీపంలో చెత్తా చెదారం, దుస్తులు, ప్లాస్టిక్ వ్యర్థాలు నీటిలో కొట్టుకొని వచ్చి మేట వేశాయి. కొన్ని ఇలా కంప చెట్లకు అతుక్కుపోయాయి.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్





## ‘శ్రీబాగ్’పై తాడోపేడో తేల్చుకుందాం

- రేపు కర్నూలులో జరిగే బహిరంగ సభకు తరలిరావాలి
- రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి



చాగలమర్రిలో మాట్లాడుతున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

**చాగలమర్రి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** శ్రీబాగ్ ఒప్పందంపై తాడోపేడో తేల్చుకోవడానికి సమయం ఆసన్నమైందని రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని టోల్‌ప్లాజా వద్ద విలేకరులతో మాట్లాడారు. రాయలసీమకు జరిగిన అన్యాయంపై కలిసి పోరాడుదామని పిలుపునిచ్చారు. కర్నూలులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగే రాయలసీమ రాష్ట్ర సమితి సమావేశానికి 12జిల్లాలు కలిపి ప్రత్యేక రాయలసీమ ఏర్పాటు సాధనకోసం రాయలసీమ అన్నిపార్టీ నాయకులు తరలి రావాలన్నారు. రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటుచేయాలని, లేదంటే కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ పాలకులు ప్రధాని మోదీపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కోస్తాంధ్ర, తెలంగాణ కంటే రాయలసీమ ప్రాంతం చాలా వెనుకబడి ఉందని, రాష్ట్ర విభజన కోసం వేసిన శ్రీకృష్ణ కమిటీ కూడా ఈవిషయాన్ని స్పష్టం చేసిందన్నారు. రాయలసీమ ఏర్పాటు సాధనకు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

## సింగపూర్‌కు తెలుగు పండిట్ లక్ష్మయ్య



**చాగలమర్రి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** సింగపూర్‌లో అమలు చేస్తున్న అధునాతన విద్యావిధానంపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల బృందాన్ని ఎంపిక చేసింది. ఇందులో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన చాగలమర్రి బాలికోన్నత పాఠశాల తెలుగు పండిట్ విడమకంటి లక్ష్మయ్యకు అవకాశం దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 27న సింగూర్‌కు వెళ్లనున్నారు. డిసెంబరు 2వరకు అక్కడ పర్యటించి బోధన విధానాలను పరిశీలిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో నమ్మకంతో తనను ఎంపిక చేసి సింగపూర్ పర్యటనకు పంపుతోందని, దీని ద్వారా మరింత బాధ్యత పెరిగిందని లక్ష్మయ్య అన్నారు.

## మహిళల ఆర్థిక స్థితి మెరుగుపర్చడమే లక్ష్యం

- మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటదాసు



మాట్లాడుతున్న మెప్మా పీడీ వెంకటదాసు

**ఆళ్లగడ్డ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** పట్టణ స్థాయిలో మహిళల ఆర్థిక స్థితి మెరుగు పర్చడమే మెప్మా లక్ష్యమని ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటదాసు తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ విభాగంలో ఓబీ, ఆర్‌పీలతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈసమావేశానికి పీడీ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మహిళల సాధికారతను బలోపేతం చేస్తామన్నారు. ప్రతి రిసోర్స్ పర్సన్ తమ పరిధిలోని ఎస్‌హెచ్‌జీలతో నిరంతరం ఫీల్డ్ విజిట్స్ నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమం లో టీఎంసీ సుజాత, సీవో శిరీష పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

- సెట్కూరు సీఈవో వేణుగోపాల్




మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో వేణుగోపాల్

**ఆలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలు వ్యసనం-పర్యవసనాలు, సైబర్ క్రైమ్ అనే అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్‌తో మనదేశంలో ప్రతి సంవత్సరం దాదాపు 1.4లక్షల మంది మరణిస్తున్నారన్నారు. మన సమాజం ఎదు ర్కొంటున్న కీలక సమస్యల్లో డ్రగ్స్ వాడకం ఒకటన్నారు. పెరుగుతున్న ఆధునిక జీవనశైలి, ఒత్తిడితో చాలామంది యువత డ్రగ్స్ వాడకానికి బానిసలవుతున్నారన్నారు. ఎక్సైజ్ సీఐ లలితదేవి మాట్లాడుతూ మత్తు పదార్థాలు జీవితాలు నాశనం చేస్తాయని, డ్రగ్స్ వినియోగించినా లేదా డ్రగ్స్ సరఫరా చేస్తూ దొరికినా కఠినశిక్షలు పడతాయ న్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు శశికుమార్, పాండురంగ, సెట్కూరు సిబ్బంది శ్రీకళానిదీష్ పాల్గొన్నారు.

## పాఠశాలల పరిశీలన

**క్రిష్ణగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** మండలంలో క్రిష్ణగిరి, కంబాలపాడులో ఉన్న పాఠశాలలను అసిస్టెంట్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ అధికారి గోవింద నాయక్ శుక్రవారం పరిశీలించారు. వచ్చే సంవత్సరం మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల కోసం పాఠశాలలో వసతులు, సౌకర్యాల పై ఆరా తీశారు. ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా వంద రోజుల ప్రణాళిక వేసుకోవాలని అన్నారు. డిసెంబరు 10లోపు సిలబస్ పూర్తిచేసి రివిజన్ టెస్టులకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడుతూ విద్య దశలో పదో తరగతి కీలకమైనదని బాగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పుట్టిన ఊరికి పేరుతేవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శేఖర్, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పీఎంఎస్ ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అరటి రైతు కుదేలు

- ధర పతనంతో లబోదిబోమంటున్న అన్నదాత
- గత ఏడాది టన్ను రూ.20 వేలు.. ప్రస్తుతం రూ.2 వేలు మాత్రమే
- తోటలను దున్నేస్తున్న రైతులు



చిన్నవంగలిలో అరటి తోటను దున్నేస్తున్న రైతు

**చాగలమర్రి/ప్యాపిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** అరటికి ధర లేక రైతులు కుదేలయ్యారు. పెట్టుబడి కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారు. చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి గ్రామంలో కొందరు రైతులు ఆశలు వదులుకొని అరటి తోటలను శుక్రవారం తొలగించారు. ఎకరాకు రూ.లక్ష దాక వ్యయం చేశామని, ధర లేక అరటి గెలలు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురునాథ్‌రెడ్డి 8 ఎకరాలు, నరేంద్రారెడ్డి 4, రాజశేఖర్‌రెడ్డి 2, లక్ష్మీనారాయణరెడ్డి 3, సంజీవరెడ్డి 4, చంద్ర ఓబుళరెడ్డి 3, సుబ్బారెడ్డి 3 ఎకరాలు, మరో 10 మంది రైతులు అరటి తోటలను తొలగించి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. కొందరు రైతులు అరటి తోటలను వదిలేశారు. గత ఏడాది టన్ను రూ.20 వేలు పలకడంతో ఈ ఏడాది 200 ఎకరాల దాక అదనంగా సాగు చేశామని, అరటి గెలలు వచ్చేసరికి టన్ను రూ.2 వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు కూడా రావని, దీంతో అరటి తోటలను తొలగిస్తున్నట్లు తెలిపారు. అధిక వర్షాలు, వైరస్ వల్ల తోటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

**ప్యాపిలి మండలంలో..**

ప్యాపిలి మండలంలో దాదాపు 2వేల ఎకరాల్లో అరటిని సాగు చేశారు. చంద్రపల్లి, వెంకటకొండాపురం, గుడిపాడు, హుసేనాపురం, పీఆర్‌పల్లి, నల్లమేకలపల్లి, బోయవాండ్లపల్లి, రాచవాండ్లపల్లి తదితర గ్రామాల్లో రైతులు అరటి సాగు చేశారు. ఎకరాకు రూ.1.2 లక్షలు పెట్టుబడి పెట్టారు. ఏటా మాదిరే ఈ సారి కూడా పంట దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. దీంతో పంట కోసం చేసిన అప్పులు తీరుతాయని రైతులు సంబరపడ్డారు. అయితే మార్కెట్‌లో పతనమైన ధరలు అరటి రైతును కుంగదీస్తున్నాయి. టన్ను అరటి ధర రూ.2వేలకు మించి పలడకడం లేదు. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. నెల రోజుల క్రిందట టన్ను రూ.2వేలకు అడిగిన వ్యాపారులు ప్రస్తుతం అదే రేటుకు ఇస్తామన్నా ముందుకు రావటం లేదు. దీంతో రైతులు కంటికి కునుకు లేకుండా సాగు చేసిన పంటను తోటల్లోనే వదిలేశారు. దీంతో కాయలు తోటల్లేనే మాగుతున్నాయి. వెంకటకొండాపురం రైతు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఐదెకరాల్లో అరటి సాగు కోసం రూ.6లక్షలు పెట్టుబడులు పెట్టానని చెప్పారు. దిగుబడులు కూడా బాగా వచ్చాయని, అయితే టన్ను రూ.2వేలకు ఇస్తామన్నా వ్యాపారులు కొనడానికి ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుడిపాడు రైతు సుధాకర్‌గుప్తా మాట్లాడుతూ 6 ఎకరాల్లో అరటి సాగుకోసం రూ.7లక్షలు పెట్టుబడులు పెట్టానని చెప్పారు. దాదాపు 60 టన్నుల దిగుబడులు వచ్చాయని చెప్పారు. టన్ను రూ.2 వేల ప్రకారం విక్రయించానని, కేవలం లక్ష రూపాయలు చేతికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.



వెంకటకొండాపురంలో తోటలోనే మాగిన కాయలు

## శ్రీశైలంలో ఘనంగా వన భోజనాలు

- పాల్గొన్న ఈవో, ట్రస్ట్ బోర్డు చైర్మన్, అధికారులు

**శ్రీశైలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం క్షేత్రానికి ఈశాన్య భాగాన ఉన్న రుద్రాపార్క్‌లో ఏర్పాటుచేసిన వనభోజనానికి ఈవో శ్రీనివాసరావు, చైర్మన్ రమేష్ నాయుడు, పాలక మండలి సభ్యులు, ఈఈలు, ఏఈవోలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో సంప్రదాయాన్ని అనుసరించి ముందుగా దేవతా వృక్షమైన ఉసిరి చెట్టుకు పూజలు జరిపించారు. ఈవో మాట్లాడుతూ ఆలయ సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతో పాటు అందరూ ఒక వేదికపై కలిసి ఆత్మీయంగా పలకరిం చుకుంటూ కుటుంబ సభ్యులతో ఆహ్లాదంగా గడపడానికి వన సమరాధన కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్తీక మాసం శ్రీశైల మహాక్షేత్రంలో వనభోజనాలు చేయడంతో ఐక్యతను చాటి చెప్పడంతో పాటు విశేష ఫలితాలు లభిస్తాయని ట్రస్టు బోర్డు చైర్మన్ రమేష్ నాయుడు అన్నారు.



వనభోజనాల్లో పాల్గొన్న చైర్మన్, ఈవో



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న అర్చకులు

## మంచాలమ్మకు బంగారు పాదుకలు



మంచాలమ్మకు బంగారు పాదుకలను పీఠాధిపతికి అందజేస్తున్న దాతలు సోమనాథ్ గౌడు, కావ్య దంపతులు

**మంత్రాలయం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** రాఘవేంద్రస్వామి మఠంలో వెలసిన గ్రామ దేవత మంచాలమ్మకు మంత్రాలయానికి చెందిన సోమనాథ్‌గౌడు, కావ్య దంపతులు రూ.1.80లక్షల విలువచేసే రెండు బంగారు పాదుకలను విరాళంగా ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సురేష్ కోణాపూర్ తెలిపారు. శుక్రవారం వారు రాఘవేంద్ర స్వామిని దర్శించుకొని బంగారు పాదుకలను పీఠాధిపతికి అందచేశారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, తంబిస్వామి, నరసింహ దేశాయ్, శ్రీపాద ఆచార్, రామయ్య, పరమేష్ గౌడు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యసేవల బలోపేతానికి కృషి

నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి



సమావేశంలో పాల్గొన్న ఎంపీ శబరి

**నంద్యాల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** సామాన్యులకు ఆధునిక వైద్యసేవల బలోపేతం కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం ఢిల్లీని పార్లమెంట్ హౌస్‌లో ఆరోగ్యం, కుటుంబం, సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి, నివారణ, నిర్ధారణ, చికిత్స నిర్వహణ అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంలో సీకేడీ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన మరింత బలోపేతం కావాలన్నారు.

# విధుల్లో ఇంత నిర్లక్ష్యమా...!

- సచివాలయ ఉద్యోగులపై జడ్పీ సీఈవో నాసరరెడ్డి ఆగ్రహం
- గ్రామ సచివాలయాల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న సీఈవో నాసరరెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**కోసిగి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** రెండు రోజుల నుంచి ‘ఆంధ్రజ్యోతి’లో గ్రామ సచివాలయాల ఉద్యోగుల తీరుపై వస్తున్న వార్తల నేపథ్యంలో శుక్రవారం కోసిగి మండలం దుద్ది గ్రామ సచివాలయాన్ని జడ్పీ సీఈవో నాసరరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్యోగుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీ సమయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మాత్రమే సచివాలయంలో ఉండగా.. మిగతా నలుగురు సిబ్బంది ఆన్‌లైన్‌లో హాజరు వేసి తమ సచివాలయాల పరిధిలోని హాజరు పట్టికలో హాజరు వేయకుండా, మూమెంటు రిజిస్టర్‌లో నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వహించారు. ఆగ్రహించిన సీఈవో ఆ నలుగురు సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. ఫీల్డ్ విజిట్ పేరుతో కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో లేకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆంధ్రజ్యోతి కథనంతో గ్రామ సచివాలయాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. కోసిగి మండలంలోని గ్రామ సచివాలయ ఉద్యోగులపై కలెక్టర్ డా. సిరి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఈయన వెంట ఎంపీడీవో మహ్మద్ బాషా, డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి తదితరులు ఉన్నారు.

**నిధుల దుర్వినియోగంపై విచారణ**

మండలంలోని సాతనూరు గ్రామ పంచాయతీలో సర్పంచ్ రూ.60 లక్షల మేర అవినీతికి పాల్పడినట్లు గ్రామానికి చెందిన వెంకటేశ్‌తో పాటు 50 మంది గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం సాతనూరు గ్రామ పంచాయతీలో సర్పంచ్ నిధుల దుర్వినియోగంపై గతంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శులతో కలిసి జడ్పీ సీఈవో నాసరరెడ్డి విచారణ చేపట్టారు. కోసిగి ఎంపీడీవో మహ్మద్ బాషా, డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరయ్యస్వామి ఆధ్వర్యంలో సాతనూరు పంచాయతీలో ఎంబుక్ రికార్డులను పరిశీలించి జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా నాసరరెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల్లో గ్రామ సర్పంచ్ పనులకు చేపట్టిన ఖర్చులు, ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

## మందుబాబులకు వినూత్న శిక్ష

**ఆళ్లగడ్డ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగంగా మద్యం తాగిన వారికి ఆళ్లగడ్డ కోర్టు శుక్రవారం వినూత్న శిక్ష విధించింది. ఇటీవల బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ 13 మంది పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. ‘బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరం’ అని ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అహగాహన కల్పించాలని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ తేజ భాస్కర్ తీర్పు ఇచ్చారు. ఈ మేరకు మందుబాబులు కానిస్టేబుల్ రఫీ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ప్లకార్డులతో ర్యాలీ చేశారు.



ఆళ్లగడ్డలో నాలుగు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహిస్తున్న మందుబాబులు

## క్యాజువాల్టీలో వైద్యులు అందుబాటులో లేకపోతే చర్యలు

కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



వైద్యసేవలను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

**కర్నూలు హాస్పిటల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** అత్యవసర విభాగమైన క్యాజువాల్టీ డ్యూటీలో ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు డీఏపీ, ఫిజీషియన్, డీఏఎస్ సర్జన్, డీవే ఆర్థోసర్జన్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, లేకపోతే చర్యలు తప్పవని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం ఉదయం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి క్యాజువాల్టీలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఆకస్మికంగా తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సీఎస్ఆర్ఎంవో, ఆర్ఎంవోలకు ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది ప్రతి రోజు ఎఫ్ఆర్ఎస్ హాజరు వేయాలని, సమయపాలన పాటించని వారిపై తక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తనిఖీలో ఆర్ఎంవో డా.టీసీహెచ్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.పద్మజ, ఎమర్జెన్సీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొ.డా.సుబ్రహ్మణ్యం, సీఎంవో డా.ఫయాజ్ పాల్గొన్నారు.

## సాగు నీరు విడుదలయ్యేలా చూస్తా

● ఇరిగేషన్ ఎస్ఈ



జిల్లా ఇరిగేషన్ ఎస్ఈకి వినతి పత్రం అందజేస్తున్న జీడీపీ సాగునీటి సంఘం సభ్యులు

గోనెగండ్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు కింద రబీలో సాగు చేసుకుంటున్న ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ ప్రాంతాల ఆయకట్టు రైతులకు 21వ తేదీ నుంచి సాగు నీరు విడుదల అయ్యేలా కలెక్టర్‌తో మాట్లాడుతానని ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం గాజులదిన్నె ప్రాజెక్టు సాగునీటి సంఘం అధ్యక్షుడు, సభ్యులు కర్నూలు జలవనరుల కార్యాలయంలో ఎస్ఈని కలిశారు. జీడీపీ సాగునీటి సంఘం సభ్యులు చేసుకున్న తీర్మాన పత్రం ఎస్ఈకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఆయకట్టు రైతులకు రబీ సాగుకు నీరు విడుదల అయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీడీపీ సాగునీటి సంఘం అధ్యక్షుడు మల్లికార్జున గౌడ్, మద్దయ్య, కౌలుట్ల, పురుషోత్తం రెడ్డి, లింగన్న పాల్గొన్నారు.

**రబీసాగుకు సిద్ధమవుతున్న జీడీపీ రైతులు:** జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి సానుకూలంగా స్పందించడంతో జీడీపీ ఆయకట్టు రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ సాగు చేసిన పంటలు అలాగే పొలంలో ఉండటంతో కొందరు వాటి తొలగించి రబీ సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. జీడీపీ కింద ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, డోన్ ప్రాంతాలలో 24,500 ఎకరాలు సాగు కావాల్సి ఉండగా ఈ ఏడాది దాదాపు 12,500 ఎకరాల నుంచి 13,000 ఎకరాల వరకు సాగు కావచ్చునని సాగునీటి సంఘం సభ్యులు అంటున్నారు.

## ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

పగిడ్యాల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్య వేధించడం, రెండో పెళ్లి చేసుకున్న ఉపాధ్యాయుడిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి పోలీసుస్టేషన్ ఏఎస్ఐ శేషయ్య తెలిపారు. వివరాలు.. మండలంలోని నెహ్రూనగర్‌కు చెందిన నాగశేషులు నందికొట్కూరులోని కోటా హైస్కూల్‌లో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన అక్క కుమార్తె శారద మల్లమ్మను ఇచ్చి 15ఏళ్ల కిందట వివాహం జరిపించారు. ఆమె జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుంది. కొంతకాలంగా నాగశేషులు అదనపు కట్నం కోసం భార్యను వేధించడంతో గ్రామ పెద్దల వద్ద పంచాయితీ పెట్టారు. అయినా అతడిలో ఎలాంటి మార్పు రాలేదు. రెండో పెళ్లి చేసుకొని భార్యను ఇంటి నుంచి గెంటివేశాడు. దీంతో ఆమె ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

## ఉద్యోగులపై విచారణకు ఆదేశాలు

● ఉత్తర్వులు జారీ చేసిన రీజనల్ డైరెక్టర్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరపాలక సంస్థ, నంద్యాల, డోన్ మున్సిపాలిటీల్లో పని చేస్తున్న ప్లానింగ్, అమ్యూనిటీస్ కార్యదర్శులపై వచ్చిన ఆరో పణలపై విచారణ చేపట్టాలని అనంతపురం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ గుజ్జుల నాగరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. డోన్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన ట్యాంకుల్లో అవినీతి జరిగినట్లు ఉన్నతాదికారుల నుంచి నివేదికలు అందాయని పేర్కొన్నారు. ఈమేరకు కర్నూలు, నంద్యాల, డోన్ మున్సిపాలిటీలలో విచారణ చేపట్టేం దుకు కర్నూలు, నంద్యాల, గుంతకల్ మున్సిపాలిటీల నుంచి డీఈఈ, ఏఈఈలను విచారణ అధికారులుగా నిమయించారు. ఈ మేరకు సంబంధిత అధికారులను తక్షణమే రిలీవ్ చేయాలని ఆర్డీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఉద్యోగుల కిడ్నాప్ కలకలం

చర్యలు తీసుకోవాలి: మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నంద్యాల విజయ డెయిరీ ఎన్నికల విధులకు వెళ్తున్న ఇద్దరు ఉద్యోగులను శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు బలవంతంగా వాహనంలో ఎక్కిం చుకొని పోవడం కలకలం రేపింది. ఈవిషయంపై మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆళ్లగడ్డ పట్టణ సీఐ యుగంధర్‌ను కలిసి కిడ్నాప్ చేసినవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈసందర్భంగా బిజేంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ విజయ పాల డెయిరీ ఎన్నికలకు సంబంధించి విధులు నిర్వహించేందుకు వెళుతున్న ఉద్యోగులు టిఫిన్ చేస్తుం డగా బలవంతంగా వాహనంలో ఎక్కించుకొని పోయారని తెలిపారు. చిన్నస్థాయి ఉద్యో గులను కూడా ప్రత్యర్థులు టార్గెట్ చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే న్యాయపరంగా పోరాడుతామన్నారు.

## యువకుడి ఆత్మహత్య

జూపాడుబంగ్లా, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారుమంచాల గ్రామానికి చెందిన సతీష్ (23) గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఎవరులేని సమయంలో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తండ్రి దేవదాసు కూలిపనివెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తలుపులు వేసి ఉన్నాయి. పగులగొట్టి చూడగా సతీష్ ఉరి వేసుకుని కనిపించాడు. దేవదాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. కొడుకు తరచూ కడుపునొప్పితో బాధపడుతుండేవాడని, కడుపు నొప్పి తాళలేక ఉరివేసుకుని ఉంటాడని తండ్రి తెలిపారు. మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం చేయించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

ఓర్వకల్లు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరు గ్రామంలో విద్యుదాఘాతంతో కౌలు రైతు బోయ పెండేకంటి రామకృష్ణ (50) శుక్రవారం మృతి చెందాడు. నన్నూరు గ్రామానికి చెందిన రామకృష్ణ రెండెకరాలు కౌలుకు తీసుకుని ఆకుకూరలు పండిస్తున్నాడు. ఉదయం ఆకుకూరలకు నీరు కట్టేందుకు వెళ్లాడు. మోటారు వద్ద స్విచ్ ఆన్ చేయగా.. విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. రామకృష్ణకు భార్య సావిత్రి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## చికిత్స పొందుతూ విశ్రాంత ఉద్యోగి..

కర్నూలు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన విశ్రాంత ఉద్యోగి సుంకన్న (72) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందారు. బి-తాండ్రపాడు చెందిన సుంకన్న అనే వృద్ధుడు మహేశ్వరాచారి అనే మరో వ్యక్తితో కలిసి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా.. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో గుర్తు తెలియని వాహనం గురువారం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన సుంకన్నను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సుంఅగ్నిమాపక శాఖలో ఉద్యోగిగా పని చేసి రిటైర్డు అయ్యారు.

## వ్యక్తి మృతదేహం లభ్యం

వెల్దుర్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలోని లద్దగిరి రోడ్డులో నార్లాపురం గ్రామ పొలాల్లో గురువారం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గుంటుపల్లి గ్రామానికి చెందిన గొల్ల సుధాకర్ (42) తనకున్న రెండెకరాల పొలాన్ని సాగుచేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే ఆయన మృతి చెందారు. మృతికి గల కారణాలు పోలీసు విచారణలో తెలియాల్సి ఉంది. సుధాకర్‌కు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని వెల్దుర్తి ఆసుపత్రికి తీసుకెళ్లారు.

# విద్యుత్ ఉద్యోగుల బదిలీల్లో అవకతవకలు



● యూనియన్ నాయకుడికి కీలక బాధ్యతలు
● సీఎండీ అనుమతి లేకుండానే జేఏఓగా ఆర్డరు
● నిబంధనలకు విరుద్ధమన్న యూనియన్ నాయకులు

కల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు విద్యుత్‌శాఖ సర్కిల్ కార్యాలయం ఉద్యోగుల బదిలీల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయి. ఓ యూనియన్‌లో కీలకంగా పనిచేస్తున్న ఉద్యోగిని అడ్మినిస్ట్రేషన్ సెక్షన్ జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా బదిలీ చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. ఉమ్మడి జిల్లాలో డిస్కం పరిధిలో నిర్వహించిన జేఏఓలకు సీఎండీ ఉత్తర్వులు అందించగా కర్నూలు నుండి పదోన్నతిపై తిరుపతికి వెళ్లిన అధికారి జేఏఓ బదిలీ ఉత్తర్వులు ఇవ్వడం పట్ల ఉద్యోగ సంఘాల నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసి గొడవకు దిగినట్లు తెలిసింది. తక్షణమే ఆ ఆర్డరును రద్దు చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిషేధం ఉన్నప్పటికీ ఆర్డరు ఇవ్వడంపై ఉద్యోగ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. పీఆర్ఈ సెక్షన్ జేఏఓగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగికి కీలకమైన అడ్మినిస్ట్రేషన్ సెక్షన్‌లో యూనియన్ నాయకుడికి జేఏఓగా బదిలీ చేయడంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఏడీఎం సెక్షన్‌లో జేఏఓగా పనిచేస్తున్న రాఘవను పీఆర్ఈ సెక్షన్ జేఏఓగా బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో జరిగిన జేఏఓలకు సీఎండీ బదిలీ ఉత్తర్వుల అందిస్తే సదరు ఉద్యోగికి ఎస్ఈనే బదిలీ ఉత్తర్వులు ఇవ్వడంలో ఆంతర్యమేంటని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అడ్మినిస్ట్రేషన్ సెక్షన్‌లో ఇప్పటి వరకు యూనియన్ నాయకుడికీ బాధ్యతలు ఇవ్వలేదు. నిబంధనలను తోసిపుచ్చి ఒక యూనియన్‌కు మాత్రమే మంచి చేసేలా వ్యవహరించడం పట్ల ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూనియన్ నాయకులకు అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలు ఇస్తే, ఒక వర్గం యూనియన్‌కే అధిక ప్రయోజనాలు, ఉద్యోగుల బదిలీలు, పాలనలో పారదర్శకత గోప్యతకు విఘాతం కలిగే అవకాశం ఉందని ఆయా సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. సర్కిల్ ఆఫీసులో ఉండాల్సిన జేఏఓ పోస్టుల కంటే అధికంగా పోస్టులు ఏర్పాటు చేశారని ఆరోపణలున్నాయి. కర్నూలు సర్కిల్ పరిధిలో ఇలాంటి బదిలీలు చాలానే జరిగాయని, అవుట్ సోర్సింగ్ పోస్టులు మంజూరు చేశారని విచారణ జరిపితే అక్రమాలు బహిర్గతం అవుతాయని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

● **నా దృష్టికి రాలేదు: ఎస్ఈ ఆర్. ప్రదీప్‌కుమార్**

కర్నూలు సర్కిల్ పరిధిలో జరిగిన జేఏఓ బదిలీల అక్రమాలు నా దృష్టికి రాలేదు. నిబంధనల మేరకు బదిలీల్లో డిస్కం సీఎండీ మార్గదర్శకాలు తప్పకుండా పాటించాలి.

# ఆపరేటర్ల నియామకంపై దుమారం

● వైసీపీ ఎమ్మెల్యేకు ప్రాధాన్యం ఇవ్వడంపై ఆగ్రహం
● మంత్రి గొట్టిపాటి, సీఎండీకి టీడీపీ నాయకుడి ఫిర్యాదు

కల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా విద్యుత్‌శాఖలో ఆపరేటర్ పోస్టుల నియామకంపై దుమారం రేగింది. గతంలో ఇక్కడ విద్యుత్‌శాఖ ఎస్ఈగా పనిచేసిన అధికారి వైసీపీకి చెందిన ఎమ్మెల్యే సూచనలతో అధిక ప్రాధాన్యమిస్తూ పోస్టులు మంజూరు చేశారన్న ఆరోపణలు వెలువడ్డాయి. ఈవిషయంపై పలుమార్లు ఎస్ఈని నిలదీస్తే తనకు తెలియకుండా ఉద్యోగులు చేశారని తప్పించుకునేందు ప్రయత్నించారు. డిస్కం పరిధిలో ఉన్నతాధికారిపై ఒత్తిడి తెచ్చి మరి వైసీపీ ఎమ్మెల్యేకు ఆపరేటర్ పోస్టులు కేటాయించారని తెలిసి సదరు టీడీపీ నేత ఖంగుతిన్నారు. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్ రాఘవేంద్రారెడ్డి చేసిన సిఫార్సులను పక్కన పెట్టి వైసీపీ ఎమ్మెల్యేకు ఆపరేటర్ పోస్టులు కేటాయించడం టీడీపీ వర్గాల్లో అసంతృప్తిని పెంచింది. ఈనేపథ్యంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్(ఐఏఎస్), విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటికీ టీడీపీ నాయకుల సూచనలను పట్టించుకోవడం లేదని వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేవారు. టీడీపీ ఇన్‌చార్జ్ ఫిర్యాదు నేపథ్యంలో డిస్కం సీఎండీ స్పందించారు. కర్నూలు జిల్లాలో ఆపరేటర్ పోస్టుల నియామకంపై నిగ్గు తేల్చేందుకు ఆయన విచారణకు ఆదేశించారు. జిల్లాలో తలెత్తిన ఆపరేటర్ పోస్టుల నియామకాలు, అవకతవకలపై ప్రస్తుత కర్నూలు ఎస్ఈ ప్రదీప్‌కుమార్‌కు ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆపరేటర్ పోస్టుల కోసం ఎవరు ఒత్తిడి చేశారు, ఎవరికి ప్రాధానత్య ఇచ్చార అన్న దానిపై విచారణ చేపట్టేందుకు కన్‌స్ట్రక్షన్ డివిజన్ ఈఈ భాస్కర్‌రావును విచారణ అధికారిగా నియమించినట్లు ఎస్ఈ తెలిపారు. విచారణ పూర్తి అవగానే నివేదికను సీఎండీ శివశంకర్‌కు అందజేస్తామన్నారు.

# భద్రతలేని వ్యవసాయ మార్కెట్



● గతంలో చోరీలు.. తాజాగా అగ్నిప్రమాదం
● ఆందోళన చెందుతున్న కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు
● సెస్సు వసూలులో అగ్రస్థానంలో ఉన్నా నిష్ప్రయోజనం

**ఎమ్మిగనూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ వేరుశనగ విక్రయాలకు పెట్టింది పేరు.. జిల్లాలో ఉన్న ప్రధాన వ్యవసాయ మార్కెట్లతో పోటీ పడుతూ ప్రతి ఏడాది టార్గెట్‌ను మించి సెస్సు వసూలులో అగ్రస్థానంలో నిలుస్తోంది. ఈ మార్కెట్‌కు ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాలతో పాటు పక్క రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్దఎత్తున రైతులు వేరుశనగ, ఆముదాలు, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తులను అమ్మకానికి తీసుకొస్తారు. దీంతో ప్రతి ఏడాది కోట్లలో లావాదేవీలు జరుగుతాయి. ఇలాంటి వ్యవసాయ మార్కెట్‌లో గతంలో మార్కెట్‌లోని గోడౌన్లలో చోరీలు జరగగా.. ఇటీవల మార్కెట్ వెనుక భాగంలో ఉన్న గోడౌన్లలో ఖాళీసంచులు కాలి బూడిదయ్యాయి. సరుకుకు భద్రత కరువైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.**



కాలిపోతున్న ఖాళీ సంచులు (ఫైల్)

**80మంది కమీషన్ ఏజెంట్లు:** వ్యవసాయ మార్కెట్ కమిటీలో 80మంది కమీషన్ ఏజెంట్లు ఉండగా ఇందులో 60మంది దాకా పంట ఉత్పత్తులను క్రయవిక్రయాలు చేస్తున్నారు. మార్కెట్‌లో 84 గోడౌన్లు ఉండగా 15వరకు మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయి. ప్రతినెల ఈ గోదాములనుంచి దాదాపు రూ. 1.60లక్షల ఆదాయం సమకూరుతోంది. అలాగే మార్కెట్ వెనుక భాగంలో 5000 మెట్రిక్ టన్నుల సరుకును నిలువచేసే భారీ గోదాము సైతం ఉంది. అలాగే కరోనా సమయం నుంచి మార్కెట్‌లో కూరకాయల హోల్‌సేల్ మార్కెట్ నడుస్తోంది. ఇందులో దాదాపు 30 మందికి పైగా చిన్న చితక వ్యాపారులు వ్యాపారాలు సాగిస్తున్నారు. వీరి నుంచి ఏడాదికి దాదాపు రూ. 30లక్షలకు పైగానే ఆదాయం సమకూరుతోంది.

**రూ. 850 కోట్ల టర్నోవర్:** ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో గత ఏడాది దాదాపు రూ. 850కోట్ల పంట ఉత్పత్తుల క్రయ విక్రయాల టర్నోవర్ జరిగింది. దీంతో మార్కెట్‌కు దాదాపు రూ. 8.50కోట్ల సెస్సు వసూలైంది.

**గతంలో చోరీలు.. తాజాగా అగ్ని ప్రమాదం:** వ్యవసాయ మార్కెట్‌లో ఎంతో విలువైన పంట ఉత్పత్తులు తొమ్మిది నెలలపాటు క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. రైతులతో పాటు వ్యాపారులు పంట ఉత్పత్తులను నిలువ చేస్తుంటారు. కమీషన్ ఏజెంట్లు సైతం సరుకుతో పాటు ఖాళీసంచులను గోదాముల్లో ఉంచుకుంటారు. ఇలాంటి మార్కెట్‌లో గత రెండేళ్ల క్రితం ముగ్గురు కమీషన్ ఏజంట్లకు చెందిన గోడౌన్లలో ఒకే రోజు చోరీలు జరిగాయి. గోడౌన్లలో నగదుతో పాటు వస్తువులను దుండగులు ఎత్తుకెళ్లారు. అలాగే ఏడాదిన్నర క్రితం మూడు దుకాణాల్లో వేరుశనగ బస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు మాయం చేశారు. గతం వారంలో ఓ దుకాణంలో వ్యాపారులు పెట్టిన ఆముదాల బస్తాలో దాదాపు 10కేజీల ఆముదాలను దుండగులు తస్కరించారు. ఇటీవల వెనుక ఉన్న గోడౌన్ల దగ్గర భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకొని ఖాళీ సంచుల వ్యాపారులు నిలువ చేసుకున్న రూ. 5లక్షల విలువ చేసే ఖాళీ సంచులు కాలిబూడిదయ్యాయి. మార్కెట్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న విషయం మార్కెట్‌లో పనిచే స్తున్న సెక్యూరిటీ గార్డుల కన్నా ముందుగా సమీపంలో ఉన్న శిల్పాకాలనీ వాసులు గమనించి మార్కెట్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. అప్పుడు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. దీన్ని బట్టి చూస్తే మార్కెట్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు ఏమేరకు పహారా కాస్తున్నారో అర్థమవుతోంది. ఎంతసేపు మార్కెట్ గేట్ దగ్గర ఉంటున్నారే తప్ప మార్కెట్‌లో భద్రత గురించి పట్టించు కోవటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేగాక మార్కెట్ లో భద్రతా చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు గతకొన్ని రోజులుగా పనిచేయటం లేదు. దీనికి తోడు మార్కెట్‌లో కూరగాయల హోల్‌సేల్ వ్యాపారాలు జరుగుతుండటంతో.. మార్కెట్‌లోకి ఎవరు వస్తున్నదీ, ఎందుకు వస్తున్నదీ అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. దీని వల్లే మార్కెట్ భద్రత దెబ్బ తింటోందని కమీషన్ ఏజెంట్లు, కొనుగోలుదారులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మార్కెట్ భద్రతపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

● **50 సీసీ కెమెరాలు, లైటింగ్ ఏర్పాటు చేస్తున్నాం**

మార్కెట్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. విచారణ చేసి చర్యలు తీసుకుంటారు. అలాగే మార్కెట్‌లో భద్రతా చర్యల్లో భాగంగా 50 సీసీ కెమాలు ఏర్పాటు చేసేందుకు టెండర్ పిలిచాం. అలాగే మార్కెట్ అంతటా లైటింగ్ ఏర్పాటు చేస్తాం. మూడు సెక్యూరిటీ గార్డులు ఖాళీగా ఉన్నాయి. వాటిని కూడా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- చంద్రమౌళి, మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి, ఎమ్మిగనూరు



వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

# ఉల్లిని వదిలేశారు..



నగల్లపాడులో ఉల్లిగడ్డలను సంచుల్లోకి వేసుకుంటున్న ప్రజలు

చాగలమర్రి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉల్లిపంట రైతులకు కన్నీరు పెట్టిస్తోంది. మూడు నెలలు కష్టించి పండించిన ఉల్లిపంటకు ధర లేక రైతులు నష్టపోయారు. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం నగల్లపాడు గ్రామంలో రైతు రామిరెడ్డి శుక్రవారం పంట పొలంలో ఉల్లి కుప్పలను వదిలేశారు. విషయం తెలుసుకున్న ప్రజలు పొలం వద్దకు వెళ్లి సంచుల్లో ఉల్లిగడ్డలను నింపుకొని తీసుకెళ్లారు. ఉల్లిగడ్డలను గొర్రెలకు మేతగా వదిలేశారు. కోత కోసిన ఉల్లిగడ్డలు వర్షానికి తడిచి దెబ్బతిన్నాయి. దీంతో రైతుకు తీరని నష్టం వాటిల్లింది. కేజీ ధర రూ.2 పలుకుతున్న ఉల్లిగడ్డల కోత కూలి ఎకరాకు రూ.20 వేలు అవుతుండటంతో పంట పొలాల్లోనే వదిలేశామని రైతు రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మూడు ఎకరాలకు రూ.2 లక్షలు ఖర్చు చేశామని, పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో పంటను వదిలేశామని అన్నారు. పంట చేతికొచ్చాక ధర పతనం కావడంతో కొనుగోలు చేసేందుకు వ్యాపారులు కూడా ముందుకు రావడం లేదు. ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ పంట సాగు చేసుకునేందుకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు కోరారు.

## చెక్క రథంపై ప్రహ్లాదరాయల విహారం



చెక్క రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై విహరించారు. శుక్రవారం కార్తీక దశమి శుభ దినంను పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. చెక్క రథాన్ని వివిధ పుష్పాలతో చూడ ముచ్చటగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు భక్తుల హర్ష ధ్వనాల మధ్య ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల మంటపంలో ఊంజలసేవలో స్వామివారిని ఊగించారు. అంతకు ముందు స్వామి వారికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించి హారతులు నిర్వహించారు. పీఠాధిపతి పూర్ణబోధ పూజ మందిరంలో సంస్థాన పూజలో భాగంగా మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది

## పిల్లల ప్రాణాలతో చెలగాటం



అప్పనపల్లె - రుద్రవరం రహదారిపై ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న చిన్నారులు

రుద్రవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం - అప్పనపల్లె రహదారిలో ఆటోలో పిల్లలు వేలాడుతూ ప్రయాణం చేశారు. శుక్రవారం అప్పనపల్లె - రుద్రవరం గ్రామాల మధ్య ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది. ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలను అరికట్టాలని కోరుతున్నారు.

# నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి: ఏఎస్పీ


రికార్డులను పరిశీలిస్తున్న ఏఎస్పీ

**మహానంది, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నామని ఏఎస్పీ జావళి తెలిపారు. శుక్రవారం మహానంది పోలీస్ స్టేషన్‌ను ఏఎస్పీ తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పోలీసుల విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలపై తెలుసుకున్నారు. మండలంలో సమస్యాత్మక గ్రామాల్లో ప్రజల రక్షణపై ఎస్ఐ రామ్మోహన్ రెడ్డితో చర్చించారు. జిల్లాలో నేరాల తగ్గుముఖానికి పోలీసులు నిరంతరం కృషి చేయాలన్నారు. మహానంది క్షేత్రంతో పాటు గాజులపల్లి మెట్ట వద్ద అదనపు పోలీసులను నియమించే విషయంపై పరిశీలించి ఏర్పాటు చేస్తామన్నారు. మహానంది ఆలయం భద్రత కోసం అదనంగా హోం గార్డులను నియమించాలని ప్రతిపాదన ఉందన్నారు. త్వరలోనే నియమిస్తామని ఏఎస్పీ తెలిపారు. ఆమె వెంట స్థానిక పోలీసులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**నందికొట్కూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** నియోజకవర్గంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం, ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ అతివృష్టి, అనావృష్టి కారణంగా దెబ్బతిన్న పంటలకు ఎకరాకు నష్ట పరిహారం రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర రూ.2400 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 17నుంచి స్థానిక శ్రీ పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం, ఏపీ రైతు సంఘం నాయకులు పక్కీర్ సాహెబ్, శ్రీనివాసులు, త్యాగరాజు, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం


ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న మైనార్టీ నాయకులు

**కొత్తపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని దుద్యాల ఉర్దూ పాఠశాలలో జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకున్న మూలింటి ఫర్జానా బేగంను ఉపాధ్యాయులు, గ్రామస్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆమె నంద్యాల మున్సిపల్ హై స్కూల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఫర్జానా బేగం విద్యారంగంలో విద్యార్థులకు తనదైన శైలీలో విశిష్ట సేవలు అందించారు. కార్యక్రమంలో టీడీపీమండల మైనార్టీ నాయకులు జీఎండీ రఫీ , ఉపాధ్యాయులు కృష్ణమోహన్, కృష్ణయ్య, ఖాజాబీ, హేమలత, నూరుద్దీన్, సాదిక్, గ్రామ పెద్దలు షబ్బీర్, మన్నే సాహెబ్, అజీజ్, ముర్తుజావలి, మాసూం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్ర పుల్లారెడ్డి వర్ధంతిని జయప్రదం చేయాలి

**ఆత్మకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 19న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఆ పార్టీజిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు జునైద్‌బాషా, ఆనందరావు ఉన్నారు.

## రైతుల సంక్షేమం కోసమే సహకార సంఘాలు


జెండా ఎగురవేస్తున్న చైర్మన్ షాబుద్దీన్

**ఆత్మకూరు, న వంబరు 14(ఆం ధ్రజ్యోతి):** రైతుల సంక్షేమం కోసమే సహకార సంఘాలను ఏర్పాటు చేసినట్లు ఆత్మకూరు సింగిల్ విండో సొసైటీ చైర్మన్ షాబుద్దీన్ తెలిపారు. శుక్రవారం స్థానిక సహకార పరపతి సంఘం కార్యాలయంలో సహకార వారోత్సవాలను ఆయన జెండా ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు చేయూతనిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి రైతులకు మంజూరయ్యే రాయితీ పథకాలు మొట్టమొదటగా సహకార సంఘాల ద్వారానే అందుతాయని అన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు మేనేజర్ మహ్మద్‌రసూల్ తదితరులున్నారు.

## 'అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేయొద్దు'

**ఆత్మకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేసే ఆలోచనను విరమించుకోవాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఎంపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపేట సచివాలయంలో ప్రీస్కూల్ బలోపేతం చేయాలని కోరుతూ.. అడ్మిన్ నాగూర్‌బాషాకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 3 నుంచి 6ఏళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లలో ఉండేవిధంగా జీవో ఇవ్వాలన్నారు. ప్రీస్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకం ఇవ్వాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, మెనూ క్వాంటిటీని పెంచాలని, ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫామ్, టై, బెల్ట్, బూట్లు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకురాలు చెన్నమ్మ, లలితమ్మ, సుజాత, శాంతి ఉన్నారు.

## బీజేపీ నాయకుల సంబరాలు

**నందికొట్కూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని పటేల్ సెంటర్‌లో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బాణ సంచా కాల్చారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నరేంద్రమోదీ, నితీష్ కుమార్ నాయకత్వంలో అఖండ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దామోదర్‌రెడ్డి, గూడూరు రవికుమార్‌రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



# భావిభారత పౌరులను తీర్చిదిద్దాలి

- టీడీపీ పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ శీలం గోవర్ధనగిరి
- జిల్లా వ్యాప్తంగా బాలల దినోత్సవం

**నందికొట్కూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని టీడీపీ పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ శీలం గోవర్ధన్ గిరి అన్నారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని బీఆర్ఆర్ నగర్‌లో ఉన్న ఎంపీపీ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో టీడీపీ పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ శీలం గోవర్ధన్ గిరి, 15వ వార్డు అధ్యక్షులు సెంథిల్, పాఠశాల చైర్మన్ నవీన్ కుమార్, ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి, పాణ్యం నరేంద్ర, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ బాలికల కళాశాల, పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు కొంగర వెంకటేశ్వర్లు, మద్దయ్య మాట్లాడుతూ పిల్లలు దేశ పౌరసత్వంలో భాగమని, దేశ అభ్యున్నతిలో పురోగతి సాధించాలనే తపన వీరిలో ఎక్కువగా ఉంటుందన్నారు. పీవోఎస్‌సీవో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కుమారస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాజా హుసేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నందికొట్కూరు బీఆర్ఆర్ నగర్‌లోని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు

**బండిఆత్మకూరు:** నేటి బాలలే రేపటి పౌరులని గ్రంథాలయ అధికారి రవిరాజ్ అన్నారు. శుక్రవారం నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సర్పంచ్ సంధ్యతో కలిసి పూలమాల వేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. రవిరాజ్ మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉసేన్, శెట్టి పాల్గొన్నారు.

**మిడుతూరు:** పుస్తక పఠనం చేయడం వల్ల విజ్ఞానవంతులు అవుతారని తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో దశరథరామయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గ్రంథాలయ వారోత్సవాలను ఎంపీడీవో దశరథరామయ్యతో కలిసి తహసీల్దారు ప్రారంభించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పరిమళ, విద్యార్థులు పాల్గొన్నారు.


బండిఆత్మకూరులో పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సర్పంచ్

**గడివేముల:** మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో రాజరాజేశ్వరి హైస్కూల్ కరస్పాండెంట్ రామేశ్వరరావు, సహకార సంఘం అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, పాణ్యం మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ రమణారెడ్డి పాల్గొన్నారు.


మిడుతూరు గ్రంథాలయంలో ..

**నందికొట్కూరు:** పట్టణంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం నుంచి వారం రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలు రోజుకో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గ్రంథాలయశాఖ అధికారి మురళీధర్ తెలిపారు. 20 న విద్యార్థులకు బహుమతులు ఇస్తామన్నారు.

**నంద్యాల కల్చరల్:** పట్టణంలోని గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నిర్వాహకుడు షేక్షావలి అధ్యక్షతన నెహ్రూ జయంతిని నిర్వహించారు. గురురాజ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరి రెడ్డి, మండల విద్యాశాఖాధికారి బ్రహ్మం ముఖ్యఅతిథులుగా హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


నందికొట్కూరు గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న లెక్చరర్ మద్దిలేటి



నంద్యాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు, విద్యార్థులు

# ఇమామ్, మౌజన్ల ఆర్థిక భద్రతకు నిధులు

- న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- సంఘం ఆధ్వర్యంలో సన్మానం


మంత్రి ఫరూక్‌కు స్వీట్ తినిపిస్తున్న ఇమామ్

**నంద్యాల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** ఇమామ్, మౌజన్‌ల ఆర్థిక భద్రతకు కూటమి ప్రభుత్వం రూ.90 కోట్లు మంజూరు చేసిందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఇమామ్, మౌజానా సంఘ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. మంత్రి ఫరూక్‌ను సంఘం ఆధ్వర్యంలో అభినందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మైనార్టీ సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎప్పటికీ కట్టుబడి ఉంటుందన్నారు. మైనార్టీలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందన్నారు. అనంతరం ఇమామ్‌ల సంఘ అధ్యక్షుడు హసీజ్‌ఖాజీ మహమ్మద్ అంజద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి ఫరూక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎన్నటికీ మరవమని కొనియాడారు. సమావేశంలో మహమ్మద్ రఫీ, సాహెబ్‌ములానా, ఇలియాజ్‌సాహెబ్, కాజీమియా, అలీమ్, ఇబ్రహీంసాహెబ్ పాల్గొన్నారు.

# కౌలు కార్డులు తీసుకోవాలి

- జేడీఏ వెంకటేశ్వర్లు
- మొక్కజొన్న సాగులో పంటకోత ప్రయోగం


మొక్కజొన్న పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జేడీఏ

**ఆత్మకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** కౌలు రైతులు కౌలు కార్డులు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం పట్టణం పరిధిలో మొక్కజొన్న సాగులో పంటకోత ప్రయోగాలను చేపట్టారు. నిర్ధేశించిన పంట విస్తీర్ణంలో మొక్కజొన్న పంటకోత ప్రయోగాన్ని చేపట్టి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కౌలు రైతులు కౌలు కార్డులు పొందాలని సూచించారు. తద్వారా ఈ-క్రాప్, పంట నష్టపరిహారం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను పొందవచ్చునని చెప్పారు. మండలంలోని బాపనంతాపురం, నల్లకాల్వ గ్రామాల్లో పంట నమోదుపై సామాజిక తనిఖీ కార్యక్రమానికి హాజరయ్యారు. వ్యవసాయ సిబ్బంది రైతు సేవా కేంద్రాల పరిధిలో ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. అలాగే రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతు యొక్క భూవివరాలను రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జేడీఏ వెంట ఆత్మకూరు ఏడీఏ హేమలత, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

**నందికుంటలో ..**

**కొత్తపల్లి:** మండలంలోని నందికుంట గ్రామ శివారులోని మొక్కజొన్న పొలంలో మండల వ్యవసాయాధికారి అమీరున్నిసా బేగం రైతులతో కలిసి పంట కోత ప్రయోగం నిర్వహించారు. 5/5 మి.మీలలో పంటను కోత కోసి మొక్కజొన్న కంకులను తూకం వేశారు. అనంతరం ఏవో మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో మొక్కజొన్న ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులకు సూచించారు. ధాన్యాన్ని ఇంకా ఆరబెట్టుకోవాలని, తేమ శాతం 14 శాతం కంటే తక్కువగా ఉండటం వల్ల బూజు లేకుండా చూసుకోవాలని రైతులకు సూచకించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది శేషు, రైతులు పాల్గొన్నారు.

## లోక కల్యాణం కోసం హోమాలు


కార్తీకమాస హోమాలలో పాల్గొన్న భక్తులు

**నంద్యాల కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని బాలాజికాంప్లెక్స్ కల్యాణ మండపంలో శుక్రవారం లోక కల్యాణం కోసం కార్తీకమాస హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మహాసంకల్పం, అగ్నిప్రార్థన సంస్కారం, గణపతి హోమం, రుద్రహోమం, పావమాన హోమం, కార్యసిద్ధి ఆంజనేయస్వామి హోమం, నక్షత్రహోమం, నవగ్రహశాంతి హోమం, ప్రపంచశాంతి హోమం అనంతరం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు ఈశ్వరనిఖిలేష్‌శర్మ, కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, నారాయణశ్రీనివాస్, దుద్దేల సురేష్‌బాబు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## మహానందిలో పల్లకీ సేవ

**మహానంది, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి ఆలయ వేదపండితులు ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. ప్రత్యేక పల్లకిపై స్వామి,అమ్మవార్లను ఆశీనులు గావించారు. అర్చకులు ప్రత్యేక ఉత్సవ పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. ఆలయ మెదటి ప్రాకారంలో భక్తుల శివనామస్మరణతో మేళ తాళాలతో పల్లకిసేవ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు నౌడూరి నాగేశ్వరశర్మ, హనుమంత్‌శర్మ, అర్చకుడు బెక్కెం శరభయ్యశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## డీఎఫ్‌వో పూజలు

కార్తీకమాసం పురస్కరించుకొని మహానంది క్షేత్రంలో అటవీశాఖ స్క్వాడ్ డీఎఫ్‌వో రాజశేఖర్ దంపతులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం ముఖద్వారం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో డీఎఫ్‌వో దంపతులు స్వామి,అమ్మవార్లకు అభిషేకార్చన పూజలు జరిపారు. కల్యాణ మంటపంలో వేదపండితులు సన్మానించి ఆశీర్వదించారు. వీరివెంట చలమరేంజ్ ఎఫ్ఆర్వో మణిదీప్ ఎఫ్‌బీఓ రాణా ప్రతాప్‌లు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోండి

**ఆత్మకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** మండలంలో అర్హులైన లబ్ధిదారులు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన - పీఎంఏవై 2.0లో భాగంగా గృహనిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు గ్రామ సచివాలయం లేదా గృహనిర్మాణశాఖ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## అన్నప్రసాద వితరణకు విరాళం

**శ్రీశైలం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ప్రసాద వితరణ పథకానికి శుక్రవారం కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన పెద్దసుబ్బారెడ్డి దంపతులు రూ. లక్ష విరాళం ఇచ్చారు. విరాళాన్ని ఆలయ డిప్యూటీ ఈవో రమణమ్మ, పర్యవేక్షకురాలు దేవికకు దాతలు అందజేశారు. దాతలకు స్వామిఅమ్మవార్ల ప్రత్యేక దర్శనంతో పాటు లడ్డూ ప్రసాదాలు, పరిమళ విభూది, శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న షేక్షావలిరెడ్డి

**నంద్యాల హాస్పిటల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి కర్నూలు జిల్లా డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో గత నెల 24న జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 19 జిల్లాస్థాయి బేస్ బాల్ పోటీల్లో కరిముల్లా, కృష్ణ అత్యంత ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులను గురురాజా సంస్థ డైరెక్టర్ షేక్షావలిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 17 వరకు కడప జిల్లాలోని రైల్వేకోడురులో జరగబోమే 69వ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు షల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలు నిర్మించాలి


ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఏపీడీ ఇస్మాయిల్

**బండిఆత్మకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** గ్రామాల్లో విరివిగా ఇంకుడు గుంతలు నిర్మించాలని ఏపీడీ ఇస్మాయిల్ సూచించారు. శుక్రవారం బండిఆత్మకూరులో ఎంపీడీవో గాయిత్రి అధ్యక్షతన సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఉపాధిలో నిర్దేశిత కంపోస్టు పిట్లు, ఇంకుడు గుంతలు, పండ్ల మొక్కల పెంపకం, ఇళ్ల నిర్మాణలో కూలీల భాగస్వామ్యం పనులు జరిగేలా చూడాలన్నారు. కూలీలకు సరైన సమయానికి వేతనాలు అందేలా మస్టర్ల ఆన్‌లైన్ ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో ఈసీ రమేష్ నాయుడు, టీఏలు శివలింగమయ్య, అభిషేకంరాజు, కిరణ్‌కుమార్, రోజారాణి, రాణి, కృష్ణవేణి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## గర్భకోశ వ్యాధి పరీక్షలు తప్పనిసరి: ఏడీ

**బండిఆత్మకూరు నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని వెలుగోడు ప్రాంతీయ కార్యాలయ సహాయ సంచాలకుడు డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి శిబిరం డాక్టర్లు అనూష, జ్యోత్స్నాదేవిలు నిర్వహించారు. శిబిరలో 60 పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే 130 పశువులకు సాధారణ పరీక్షలు నిర్వహించారు. పశువుల పెంపకంలో యజమానులు తగు జాగ్రత్తలు పాటించాలని ఏడీఏ సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు కిశోర్‌కుమార్, ప్రత్యూష, గ్రామ పెద్దలు నడిపినేని కృష్ణ, రామచంద్రయ్య, ఆంబ్రోజ్, జేవీవీ సునీల్‌కుమార్, ఆహేలు పాల్గొన్నారు.

## పంట నమోదు జాబితా ప్రదర్శన

**గడివేముల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్ సీజన్ సంబంధించిన పంట నమోదు జాబితాను శుక్రవారం తహసీల్దార్ వెంకటరమణ, వ్యవసాయశాఖ మండల అధికారి పవన్‌కుమార్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 31,494 ఎకరాలకు గాను 11,722 మంది రైతులు పంట నమోదు చేసుకున్నారని అన్నారు. ఈ జాబితాలో తప్పొప్పులు ఉంటే ఈనెల 17వ తేదీ లోపు రైతులు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పంట నమోదు ద్వారానే పంట నష్టపరిహారం, సబ్సిడీ, పంట కొనుగోలు వంటి ప్రభుత్వ పథకాలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మకర్తల మండలికి దరఖాస్తులు

**నంద్యాల కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** పట్టణంలో వెలసిన బ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తలమండలి సభ్యుల నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈవో మాట్లాడుతూ కమిషనర్, దేవాదాయశాఖ, విజయవాడ నోటిఫికేషన్ జారీచేసినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులను ఈనెల 27 సాయంత్రం 5గంటలలోగా జిల్లా దేవాదాయ శాఖ అధికారి కార్యాలయానికి పంపాలని ఈవో సూచించారు.

## ప్రజాస్వామ్యవాదులు మద్దతు ఇవ్వాలి


మాట్లాడుతున్న రంగనాయుడు

**నంద్యాల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) :** సామాజిక న్యాయం, సమానత్వ సాధన కోసం ఈ నెల 18న సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసనకు ప్రజాస్వామ్యవాదులు మద్దతివ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు కోరారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా దళిత, గిరిజన మైనారిటీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులను ఖండిస్తూ జనగణలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో మతోన్మాద పాలన సాగుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, రైతు సంఘ జిల్లా కార్యదర్శి సోమన్న, చేతి వృత్తిదారుల సంఘ జిల్లా కార్యదర్శి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

## బిందు సేద్యంతో అధిక దిగుబడి



ఉల్లి పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి నాగరాజు

**డోన్ రూరల్ నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** బిందు సేద్యంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాఖాధికారి నాగరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఉల్లి పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకుముందు తిమ్మాపురం పరిసరాల్లో ఉన్న పంటలను ఉద్యాన జిల్లా అధికారి నాగరాజు పరిశీలించారు. అనంతరం డోన్ ఉద్యానశాఖ అధికారి కళ్యాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించివచ్చన్నారు. అలాగే మహానంది నుంచి ఉద్యాన పరిశోధన స్థానం ప్రిన్సిపాల్ సైంటిస్టు ఠాగూర్ నాయక్ మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం, తెగుళ్ల నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

## సుంకిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం



నివాళి అర్పిస్తున్న బీసీ రాజారెడ్డి

**కోవెలకుంట్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** కోవెలకుంట్ల మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు అరికట్ల సుంకిరెడ్డి మృతి తీవ్ర బాధాకరమని, వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని భీమునిపాడు గ్రామంలో టీడీపీ నాయకులు సుంకిరెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈసందర్భంగా బీసీ రాజారెడ్డి, బీసీ ఇందిరమ్మ గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గువ్వల సుబ్బారెడ్డి, కంపమల్ల చిన్న సుబ్బారెడ్డి, అమడాల మద్దిలేటి పాల్గొన్నారు.

## టీజీ బ్లాక్ చానెల్‌కు మరమ్మతులు




తెలుగుగంగ బ్లాక్ చానెల్‌కు ఎక్స్‌కవేటర్‌తో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

**రుద్రవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** 'టీజీ బ్లాక్ చానెల్‌కు గండి' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైంది. దీంతో తెలుగు గంగ అధికారులు స్పందించారు. డీఈ రత్నరాజు మాట్లాడుతూ బ్లాక్ చానెల్ గండికి ఇసుక సంచులు వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేయించామన్నారు.

## ఆలయాభివృద్ధికి విరాళం



ఆలయ సిబ్బందికి విరాళం అందజేస్తున్న దాతలు

**బనగానపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** నందవరం చౌడేశ్వరీ మాత ఆలయాభివృద్ధికి బండి ఆత్మకూరుకు చెందిన బొంతల చంద్రేశ్, వారి కుటుంబ సభ్యులు రూ.43వేలు శుక్రవారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బందికి అందించారు. ఆలయాభివృద్ధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని పీవీ కుమార్‌రెడ్డి కోరారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు



కోట్ల సుజాతమ్మను సన్మానిస్తున్న దృశ్యం

**డోన్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** పాతపేటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణోత్సవానికి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ముఖ్యఅతిధిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆమె మాట్లాడుతూ దేవతామూర్తుల ఆశీర్వదంతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో పాత పేట సుధీష్, సరోజ, ప్రహ్లాద, ఆది నారాయణ, కనపకుంట గోవిందరెడ్డి, చనుగొండ్ల శ్రీరాములు, మహిళలు పాల్గొన్నారు

## కుష్టు వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు

**చాగలమర్రి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** కుష్టువ్యాధి నిర్మూలన అందరి బాధ్యతని ముత్యాలపాడు ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కుష్టువ్యాధి గుర్తింపు సర్వేపై ఆరోగ్య, ఆశ, మగ వలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 30 తేదీ వరకు కుష్టువ్యాధి లక్షణాలు ఉన్నవారిని గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేపడుతున్నామన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి సుబ్బరాయుడు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



# ఘనంగా బాలల దినోత్సవం

**డోన్ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేఎస్ భానుసింగ్, సంఘం నాయకులు గోపాల్, గాలయ్య, మౌలాలి, రామదాసరెడ్డి, లక్ష్మిరెడ్డి, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

● స్థానిక కేజీబీవీ పాఠశాలలో జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం శెట్టి, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు నరసింహులు, కేజీబీవీ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మి పాల్గొన్నారు.

**బనగానపల్లె:** పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా బనగానపల్లె పల్లె జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రతిమ హాజరై మాట్లాడారు. దేశాభివృద్ధిలో బాలికలదే కీలక పాత్ర అని అన్నారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ కల్పన, లాయర్లు అజాంహుసేన్, నరసింహారెడ్డి, తులసిశ్వరమ్మ పాల్గొన్నారు.

● పట్టణంలోని కస్బా ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం సుంకన్న ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యప్రకాశ్, సయ్యద్ అబ్దుల్ కలాం, విజయ, దుర్గా, ముంతాజ్‌బేగం, నీలి మహేశ్వరమ్మ పాల్గొన్నారు.

● మండలంలోని కైపలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రఘునాథ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తెలుగుపేట ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ప్రతాప్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

### చిన్నారుల బాధ్యత తల్లిదండ్రులదే: బీసీ ఇందిరమ్మ

చిన్నారుల బాధ్యత తల్లిదండ్రులే తీసుకోవాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారుల తల్లులకు జిల్లా హాస్పిటల్ సర్వీసెస్ కోఆర్డినేటర్ డాక్టర్ లలితాయాదవ్, సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాదేవి సమక్షంలో బీసీ ఇందిరమ్మ స్టీల్ గ్లాసులు, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ చిన్నపిల్లల విషయంలో డాక్టర్ల సలహాలు తల్లులు పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య శాల డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**కొలిమిగుండ్ల:** స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం బాలల దినోత్సవం నిర్వహించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి గ్రంథాల యాధికారి రాజమనోహర్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

**చాగలమర్రి:** స్థానిక అజీమ్ బ్రిలియంట్ ఉన్నత పాఠశాల, గ్రంథాలయంలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి రామచంద్రుడు నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు లాలయ్య, నారాయణ, మల్లి పాల్గొన్నారు.

**దొర్నిపాడు:** స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ అఖిలబేగం నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చాకరాజువేముల పాఠశాలలో టీడీపీ నాయకులు కేసీకెనాల్ సాగునీటి సంఘం అధ్యక్షుడు లింగుట్ల వెంకట్‌నాయుడు, డీలర్‌లు రమణయ్య, హబీబ్‌బాషా, బాలనరసింహులు, భాస్కర్‌రెడ్డి విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

**ప్యాపిలి:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సరస్వతి శిశు మందిరంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**శిరివెళ్ల:** మండలంలోని అన్ని పాఠశాలల్లో, గ్రంథాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్ర మాల్లో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇష్రత్ బేగం, లైబ్రేరియన్ సుజాత, విశ్రాంత ఎంఈవో మహబూబ్ బాషా, విశ్రాంత ఉద్యోగులు నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

**అవుకు:** స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ ఇన్‌చార్జి రామదాసు, పంచాయతీ కార్యాలయం ఈవో హరిప్రసాద్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలికలు పాల్గొన్నారు.

**కోవెలకుంట్ల:** స్థానిక గ్రంథాయలయంలో లైబేరియన్ బాల తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి పంచాయతీరాజ్ శాఖ విశ్రాంత అధికారి నాగయ్య హాజరయ్యారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గిద్దలూరు గ్రంథాలయాధికారి మద్దిలేటి, అటెండరు బేల్దాజరు పాల్గొన్నారు.

**సంజామల:** గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంజామల గ్రంథాలయ అధికారి బాలతిమ్మారెడ్డి కోరారు. శుక్రవారం గిద్దలూరులో పుస్తక నిక్షిప్త కేంద్రంలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పుస్తక నిక్షిప్త కేంద్ర నిర్వాహకులు మద్దలేటి, చిన్నరాంపుల్లయ్య, రాముడు పాల్గొన్నారు.

**రుద్రవరం:** స్థానిక ఆదర్శ చైతన్య జడ్పీ ఉన్నత పాఠశాలలో నెహ్రూ జయంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. హెచ్ ఎంలు బాలగురప్ప, బాలక్రిష్ణ, రామక్రిష్ణ, వెంకటరమణ, ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.



ప్యాపిలిలో..



శిరివెళ్లలో..



చాకరాజువేములలో విద్యార్థులకు పండ్లు పంచుతున్న టీడీపీ నాయకులు



డోన్‌లో నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పెన్షనర్లు



బనగానపల్లె: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రతిమ



మాట్లాడుతున్న టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ



చాగలమర్రిలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు



కోవెలకుంట్లలో..



కొలిమిగుండ్లలో..



అవుకులో..



సంజామలలో..

## వడ్డెర్లు రాజకీయంగా ఎదగాలి




ర్యాలీ నిర్వహిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

**డోన్ రూరల్ నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** వడ్డెర్లు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని గుత్తి సబ్ జైలు సూపరింటెండెంట్ మహేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణం సమీపంలోని పెరెంటాలమ్మ గుడి వద్ద వడ్డెరుల కార్తీక వనభోజనాన్ని వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకుముందు సంఘం అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని పాతబస్టాండు నుంచి పేరెంటాలమ్మ గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గుత్తి సబ్ జైల్ సూపరింటెండెంట్ మహేష్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, కాంతయ్య, బాలాజి, చక్రిధర్, వెంకట్రాముడు, నాగేంద్ర, రామాంజనేయులు, శివకృష్ణ, చిన్న మద్దిలేటి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామికి పడి పూజ

**డోన్ టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని గంగమ్మ ఆలయం లో ఆలయ ధర్మకర్త కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప స్వామికి పడి పూజ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘవేంద్రగౌడు హాజరై అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాద వితరణ గావించారు. టీడీపీ నాయకుడు సుదీష్ పాల్గొన్నారు.

● కార్తీక మాసం సందర్భంగా పట్టణంలోని సాంబశివాలయంలో ధర్మకర్త కల్లె షేషావలి శర్మ, అనూరాధ ఆధ్వర్యంలో భక్తులు స్వామి వారికి పూజలు చేశారు. అలాగే జక్క మధుసూదన్ గుప్తా, రాఘవతి కుటుంబ సభ్యుల సౌజన్యంతో భక్తులకు ఆలయ భక్త బృందం సభ్యులకు సామూహిక వడి బియ్యం నిర్వహించారు. టీడీపీ నాయకులు చనుగొండ్ల శేఖర్, కమలాపురం దిలీప్‌రెడ్డి, గురుస్వామి, గోపాలాచారి, మాజీ కౌన్సిలర్ కృష్ణమ్మ పాల్గొన్నారు.

## స్వామిత్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**బనగానపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** స్వామిత్ర పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో బాలాంజనేయులు, మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని కాపులపల్లె గ్రామంలో అధికారులు గ్రామ సభ నిర్వహించి స్వామిత్ర పత్రా లను ఇంటి యజమానులకు అందించారు. డిప్యూటీ ఎంపీడీవో బాలాంజ నేయులు మాట్లాడుతూ ఇంటి యజమానులు తమ ఇంటికి సంబంధించిన కొలతలను సరిచూసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, అంకిరెడ్డి, బాషా పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

**అవుకు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి భూకబ్జాదారులకు హెచ్చరించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'చాకిరేవు తిప్పకు వారసత్వ పత్రం' కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అవుకు పంచాయతీ కార్యాలయం ఈవో హరిప్రసాద్ ఇచ్చే సమాచారంతో నివేదికను తయారుచేసి జేసీకి పంపుతామన్నారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణదారునిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## ఎన్నికల నామినేషన్లపై ఉత్కంఠ

**చాగలమర్రి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** మండలంలోని నగల్లపాడు డెయిరీ సొసైటీకి ఖాళీ ఏర్పడ్డ రెండు డైరెక్టర్ల స్థానానికి శుక్రవారం నామి నేషన్ల ప్రక్రియ జరగాల్సి ఉంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సంబంధిత ఎన్నికల అధికారి రాకపోవడంతో నామినే షన్లు నిర్వహించలేదు. సంబంధిత ఎన్నికల అధికారి నామినేషన్ల స్వీకరణకు గైర్హాజరయ్యారు. దీంతో డెయిరీ నామినేషన్ల ప్రక్రియ జరగలేదు. వాయిదా వేశారా లేక ఏకగ్రీవంగా నిర్వహిస్తారా అనే ఉత్కంఠత నెల కొంది.

## డ్రంకెన్ డ్రైవ్‌లో వ్యక్తికి జైలు

**చాగలమర్రి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి గ్రామంలో మద్యం తాగి వాహనం నడిపి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన జెట్టి రాముకు జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ సురేష్ శుక్రవారం తెలిపారు. మద్యం తాగి వాహనం నడు పుతుండగా డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశామని తెలిపారు. ఆళ్లగడ్డ కోర్టులో హాజరుపరుచగా జేఎంసీఎం 10 రోజులు జైలుశిక్ష విధించారన్నారు.

# ఆలయాభివృద్ధికి కృషి

**ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి**

**డోన్ టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** శ్రీకృష్ణ ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని న్యూ రిజిస్ట్రార్ కార్యాలయ వద్ద ఉన్న శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కోట్ల ముఖ్యఅతిథిగా హాజరై భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సుంకన్న, వెంకటనాయునిపల్లె శ్రీనివాసులు యాదవ్, సోమేష్ యాదవ్, లక్ష్మీనారాయణ యాదవ్, గురుస్వామి యాదవ్, రాముడు యాదవ్, శేఖర్ యాదవ్, శ్రీను, కృష్ణమూర్తి, ప్రకాష్ పాల్గొన్నారు.

**క్రీడా సామగ్రి పంపిణీ:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడాకారులకు ఎమ్మెల్యే కోట్ల సొంత నిధులతో జెర్సీలు, షూస్, ఫుట్‌బాల్స్‌ను పంపిణీ చేశారు. లక్ష్మీరెడ్డి, పీఈటీ మోహన్, ఉమర్ పాల్గొన్నారు.



ప్యాపిలిలో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోట్ల



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

● బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని గుత్తి కోఆపరేటివ్ బ్యాంకు నూతన శాఖను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు టీఈ రాఘ వేంద్రగౌడు, ఆర్మీ రామయ్య, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలను పరిష్కరించాలి: ఎమ్మెల్యే

**ప్యాపిలి:** ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానికి ప్రభుత్వ విశ్రాంత భవనంలో ఆయన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. కోట్ల మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి త్వరతిగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ వెంకటరామిరెడ్డి, తహసీల్దారు భారతి, ఎంపీడీవో శ్రీనివా సరావు, ఏఈలు ప్రభాకర్‌రెడ్డి, మనోహర్, వినయ్‌కుమార్, ఏవో రాజష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## అన్నదానం మహా దానం

**ఆళ్లగడ్డ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** అన్ని దానాల కంటే అన్నదానం మహోన్నతమైందని జిల్లా రిటైర్డ్ న్యాయాధికారి కాశీభట్ల శివప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ఏర్పాటై నాలుగేళ్లు కావస్తున్న సందర్భంగా 150 మంది రోగులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు చౌట గంగన్న, ఆసుపత్రి వైద్యురాలు సుజాత, రాజ్యలక్ష్మి, లయన్స్ క్లబ్ సభ్యులు, మెమోరియల్ టస్ట్ర సభ్యులు పాల్గొన్నారు.

## న్యాయవాదిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

**కోవెలకుంట్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** న్యాయవాది రాజశేఖర్‌పై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని కోవెలకుంట్ల న్యాయవాదుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఓబులేసు మాట్లాడుతూ ఈనెల 11న న్యాయవాది రాజశేఖర్ పుత్తూరు కోర్టులో ఉండగా ప్రతివాది కారుతో గుద్ది చంపడానికి ప్రయత్నించగా తృటిలో గాయాలతో బయట పడ్డాడు. కార్యక్రమంలో న్యాయవాదులు రమేశ్, శేఖర్, చంద్రుడు, సుధాకర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## నేడు గుండం ఆంజనేయస్వామి తిరునాళ్లు

**కొలిమిగుండ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గుండం ఆంజనేయస్వామి తిరుణాల శనివారం జరగనుంది. శుక్రవారం కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు ఆలయ పరిసరాలను పరిశీలించి ఆలయ నిర్వాహకులకు ప్రత్యేక సూచనలు చేశారు. తిరునాళ్లకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు.

## 'చలో ఢిల్లీ'కి ఎమ్మార్పీఎస్ నాయకులు

**కొలిమిగుండ్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు శుక్రవారం చలో ఢిల్లీ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా ఢిల్లీలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దస్తగిరి మాదిగ, సీనియర్ న్యాయవాది మందా విజయ్, మండల అధ్యక్షుడు తోళ్ల నాగాంజనేయ, కొండా రామ చంద్ర, మందా వెంకటేశ్వర్లు బయలుదేరి వెళ్లారు.

## సహకార సంఘాల బలోపేతానికి కృషి



జెండాను ఆవిష్కరిస్తున్న చైర్మన్ శ్రీనివాసరెడ్డి

**శిరివెళ్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** సహకార సంఘాల బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని శిరివెళ్ల సొసైటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి అన్నారు. సహకార వారోత్సవాల్లో భాగంగా సొసైటీ ఆవరణలో ఆయన శుక్ర వారం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఈవో మహబూబ్ బేగ్, డైరెక్టర్లు సూరా శ్రీనివాసులు, మధుసూదన్, సిబ్బంది నాగులయ్య, హుసేన్ బాషా పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుల సంబరాలు

**బనగానపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** బీహార్‌లో జరిగిన ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడంపై శుక్రవారం బనగానపల్లెలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి శివకృష్ణ యాదవ్ మాట్లాడుతూ దేశభద్రతకు బీహారీలు పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శరత్‌చంద్రకుమార్, హరికృష్ణగౌడ్, యాదగిరి, బాల వెంకటేశ్వర్లు, మహేశ్వరమ్మ, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా చౌడేశ్వరీమాత పల్లకీ సేవ

**బనగానపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాసరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, ఆలయ పూజా రులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు.

## పాఠశాలలో వనభోజనం

**బనగానపల్లె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** మండలంలోని వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బాలల దినోత్సవం సందర్భంగా హెచ్‌ఎం ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం భోజనం వడ్డించారు. రకరకాల వంటలచే విద్యాకమిటీ సభ్యులు, ఉపాధ్యాయులకు, గ్రామ పెద్దలకు వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంఈవో స్వరూప, పారిశ్రా మికవేత్త సీహెచ్ నాగభూషణంరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రామకృష్ణ, తిప్పారెడ్డి పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలకు దరఖాస్తుల స్వీకరణ

**కొలిమిగుండ్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):** ఆవాస్ ప్లస్ పథకం కింద ఇల్లులేని నిరుపేదలు ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో దస్తగిరిబాబు శుక్రవారం తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.